
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

ట్రావెల్స్ బస్సు బోల్తా.. నలుగురు దుర్మరణం



2



2

రన్నింగ్ కారులో మంటలు

## జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి



**అక్షరటుడే, మెండోరా:** శ్రీరాం సాగర్ ప్రాజెక్టు వద్ద నెలకొల్పిన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. ఈ మేరకు అధికారులు వివరాలు వెల్లడించారు. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువకు 5,500 క్యూసెక్కులు ద్వారా నీటి విడుదల జరుగుతున్నందున మూడు టర్బయిన్లతో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని డీఈ శ్రీనివాస్ తెలిపారు. మూడు టర్బయిన్ల ద్వారా 18.85 మెగా వాట్ల విద్యుత్.. ఒకరోజులో 0.4536 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని తెలియజేశారు.



## సమన్వయంతో అభివృద్ధి పనులు చేపట్టాలి: ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు సక్రమంగా జరగాలంటే సర్పంచ్‌ల నుంచి మండల నాయకుల వరకు అందరూ సమన్వయంగా ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. జుక్కల్ మండల కేంద్రంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రానున్న రాష్ట్ర బడ్జెట్‌లో పంచాయతీలు, మున్సిపాలిటీలు ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ రంగాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం ఆయన మండల కేంద్రంలో, గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను పరిశీలించి పనులు నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. తదుపరి పెద్దగుల్ల గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## ఐవీఎఫ్ సేవలు అభినందనీయం: జిల్లా న్యాయ సేవల సంస్థ కార్యదర్శి

**అక్షరటుడే, కామారెడ్డి:** ఐవీఎఫ్ సంస్థ చేపడుతున్న సేవలు అభినందనీయమని జిల్లా న్యాయ సేవల సంస్థ కార్యదర్శి టి.నాగరాణి తెలిపారు. ఐవీఎఫ్ ఆధ్వర్యంలో జీజీహెచ్‌లో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నవజాత శిశువుల కోసం ప్రత్యేక కిట్స్‌ను శిశువుల తల్లులకు పంపిణీ చేశారు. జిల్లా న్యాయ సేవల సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ.. పిల్లలు దేవుళ్లతో సమానమని పేర్కొన్నారు. పిల్లలకు పౌష్టికాహారం అందించడం మన బాధ్యత అని తెలిపారు. అప్పుడే వాళ్లు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని చేపట్టిన ఐవీఎఫ్ సంస్థను అభినందించారు. ఐవీఎఫ్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఐవీఎఫ్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా రూ.1,600 విలువైన 40 కిట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వీణ, తహశీల్దార్ హిమబిందు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్ రావు, ఐవీఎఫ్ అధ్యక్షులు ఎర్రం చంద్రశేఖర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి దొంతి సుధాకర్ గుప్తా, కోశాధికారి వెంకటేష్ గుప్తా, మహిళా విభాగం అధ్యక్షురాలు నీల రజిని, కార్యదర్శి చిలువేరి శ్రీదేవి, కోశాధికారి గజవాడ అన్నపూర్ణ, యువజన నాయకులు ఈశ్వర్ గుప్తా చరణ్, ప్రవీణ్, నికిల్, కొత్త సంగరాజు గుప్తా, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు వేళ అయింది. రేపటి నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. అయితే ఈసారి గతంలో మాదిరిగా కాకుండా ఏకంగా నెల రోజులపాటు పరీక్షలు జరగనున్నాయి. ఈనెల 14 నుంచి ఏప్రిల్ 13 వరకు కొనసాగనున్నాయి. ఒక్కో పరీక్షకు సుమారు నాలుగు రోజులు విరామం లభించనుంది. ఈ సెలవు రోజుల్లో పాఠశాలల్లో స్టడీ అవర్స్‌కు హాజరయ్యేలా విద్యాశాఖ ప్రణాళిక రూపొందించింది.

– అక్షరటుడే, ఇందూరు



# రేపటి నుంచి పది పరీక్షలు

■ ఉమ్మడి జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
■ ప్రతి పరీక్షకు మూడు నుంచి నాలుగు రోజుల గ్యాప్ ■ సెలవు రోజుల్లో స్టడీ అవర్స్

పదో తరగతి పరీక్షలను ఈ ఏడాది సీబీఎస్సీ తరహాలో నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. ప్రధానంగా ప్రతి పరీక్షలకు మధ్య సుదీర్ఘ విరామం ఇస్తూ నిర్వహిస్తున్నారు. నెలరోజులపాటు పరీక్షలు ఉండటంతో విద్యార్థుల్లో కొంత ఆందోళన కలిగిస్తోంది. అయితే ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు ఇది మంచి అవకాశంగా అధికారులు చెబుతున్నారు. పరీక్ష మధ్యలో వచ్చే సెలవు రోజుల్లో పాఠశాలకు హాజరవ్వాలని, నిత్యం స్టడీ అవర్స్ కొనసాగిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

### 144 పరీక్ష కేంద్రాలు

నిజామాబాద్ జిల్లాలో పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం విద్యార్థులు 24,399 మంది ఉండగా... ఇందులో బాలురు 12,244 మంది, అమ్మాయిలు 12,155 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 144 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.. ప్రతి కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంటల్ అధికారిని నియమించారు. అలాగే 1,214 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ఇప్పటికే అన్ని పాఠశాలల్లో హాల్ టికెట్లను విద్యార్థులకు అందజేశారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ నెల 14న తెలుగు, 18న హిందీ, 23న ఆంగ్లం, 28న గణితం, ఏప్రిల్ 2న భౌతిక శాస్త్రం, ఏప్రిల్ 7న జీవ శాస్త్రం, 13న సాంఘిక శాస్త్రం పరీక్షలు ఉన్నాయి.

### కామారెడ్డి జిల్లాలో..

కామారెడ్డి జిల్లాలో పదో తరగతి పరీక్షలు నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. జిల్లాలో మొత్తం 13,154 మంది విద్యార్థులు ఉండగా ఇందులో 6,451 మంది బాలురు, 6,703 మంది బాలికలు పరీక్షలు రాయనున్నారు. జిల్లాలో మొత్తం 65 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందుకోసం 65 మంది చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారులు, 739 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్, 12 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు.

### ముందే రావాలి

విద్యార్థులు ఎటువంటి ఆందోళన చెందకుండా పరీక్ష సమయానికి అరగంట ముందే కేంద్రానికి చేరుకోవాలి. 5 నిమిషాలు ఆలస్యమైన అనుమతిస్తాం. జిల్లా వ్యాప్తంగా 144 పరీక్ష కేంద్రాల ఏర్పాటు చేశాం. పరీక్షలకు సంబంధించి ఎటువంటి సందేహాలు ఉన్న హెల్ప్ లైన్ నంబర్‌కు 9030282993 ఫోన్ చేయాలి.

– అశోక్, డీఈవో, నిజామాబాద్

## కామారెడ్డిలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయాలి: కేంద్ర మంత్రికి ఎమ్మెల్యే వినతి

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి ఎమ్మెల్యే ఢిల్లీలో కేంద్ర మంత్రులను వరుసగా కలుస్తూ కామారెడ్డిలో పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు అందజేస్తున్నారు. నిధుల మంజూరు కోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మను శుక్రవారం ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి కలిశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో పారిశ్రామిక వాడ ఏర్పాటు చేయాలని కోరారు. పారిశ్రామిక వాడ ఏర్పాటు చేయడమే కాకుండా జిల్లా కేంద్రంతో పాటు 7 మండలాలలో యువతకు, మహిళలకు ఉపాధి అవకాశాలు పెంచే విధంగా ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు సంఘటితంగా నూతన పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రికి విన్నవించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కామారెడ్డిలో పరిశ్రమల ఏర్పాటుకు అన్నిరకాల సౌకర్యాలు ఉన్నాయని, విద్యావంతులైన యువకులు, మహిళలకు కొదవ లేదని ఎమ్మెల్యే వివరించారు. వారిని భాగస్వామ్యం చేస్తూ పరిశ్రమలు నెలకొల్పితే ప్రస్తుతం ఆర్థికంగా నిలదొక్కుకోవడమే కాకుండా ఉత్పాదకత పెరిగి అభివృద్ధి చెందిన ప్రాంతంగా కామారెడ్డి ప్రాంతానికి



మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ విషయమై మౌఖిక ఆదేశాలు జారీ చేసి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు, ఇతర విభాగాల వారితో సమగ్రంగా చర్చిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే కేవీఆర్ తెలిపారు.



## గోదావరి పుష్కరాలకు ఏర్పాట్లు చేయాలి


### మంత్రి కోమటిరెడ్డికి ఎంపీ అర్వింద్ లేఖ

**అక్షరటుడే, ఇందూరు:** రాబోయే 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని గోదావరి నది తీర ప్రాంతాల్లో ఘాట్ల వద్ద ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి కోరారు. ఈ మేరకు ఈ మేరకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కి లేఖ రాశారు. నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో గోదావరి తీరం వెంట ఉన్న ఘాట్‌లకు కోట్లాది భక్తులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా కందకుర్తి, పోచంపాడ్, తడపాకల్, వాల్గొండ వంటి ప్రధాన ఘాట్‌ల వద్ద భారీగా భక్తుల రద్దీ ఉండనున్నందున ఈ ప్రాంతాల్లో ప్రత్యేకంగా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఘాట్‌ల అభివృద్ధి, ట్రాఫిక్ నిర్వహణ, తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్య సదుపాయాలు, వంటి అంశాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.



## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీపీ సాయి చైతన్య సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. చాలామంది ప్రజలు న్యాయ సంబంధిత సమస్యలను తేల్చుకోలేక ఇబ్బందులు పడుతుంటారని వారికి పరిష్కార మార్గం చూపిందుకే లోక్ అదాలత్ ను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని సాయి చైతన్య పేర్కొన్నారు. ఈనెల 28న నిర్వహించే జాతీయలోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నచిన్న కేసులు, ట్రాఫిక్ చలానాలు, మైనర్ క్రిమినల్ కేసులు, సివిల్ తగాదాలు లోక్ అదాలత్‌లో పరిష్కారం అవుతాయని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న కేసులను తక్కువ సమయంలోనే పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని ఆయన తెలియజేశారు. దీనికి సంబంధించి పోలీస్‌శాఖ తరపున ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.



## గ్యాస్ సిలిండర్ల కొరత లేదు.. ఆందోళన చెందవద్దు

**అక్షరటుడే, ఇందూరు:** వంట గ్యాస్ సిలిండర్ల విషయంలో ప్రజలు ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. జిల్లా అవసరాలకు సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో 5,81,769 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని.. 33 గ్యాస్ ఏజెన్సీల ద్వారా సరఫరా జరుగుతోందని తెలిపారు. శుక్రవారం నాటికి 1,00,850 సిలిండర్లు జిల్లాలో గృహ అవసరాల కోసం పంపిణీ నిమిత్తం అందుబాటులో ఉన్నాయన్నారు. వీటికి అదనంగా మరో 585 సిలిండర్లు జిల్లాకు రానున్నాయని చెప్పారు. సిలిండర్ బుక్ చేసిన వారికి మూడు నుంచి నాలుగు రోజుల వ్యవధిలో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా గ్యాస్ సిలిండర్ల కృత్రిమ కొరత సృష్టించి.. బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తే నిత్యవసరాల సరుకుల చట్టం 1955 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే తనిఖీలను ముమ్మరం చేయించామని తెలిపారు. మార్చిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు ఆకస్మిక దాడులు జరిపిన సందర్భంగా వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న 156 డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకొని నిర్వాహకులపై కేసును నమోదు చేశామన్నారు. సమావేశంలో అదనపు డీసీపీ బస్వారెడ్డి, ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, ఏఎస్‌వో అరవింద్ రెడ్డి, డీటీవో ఉమామహేశ్వరరావు, డీపీవో శ్రీనివాసరావు, డీడబ్ల్యూవో పద్మ పాల్గొన్నారు.

## భజనలతో ఆధ్యాత్మికత పెంపొందుతుంది

**అక్షరటుడే, ఇందూరు:** భజనలు సంకీర్తనలతో ఆధ్యాత్మికతను పెంపొందించడంతోపాటు ప్రజల్లో ఐక్యత ఏర్పడుతుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. నగరంలోని ఖానాపూర్ విఠలేశ్వర నగర్‌లో నిర్వహిస్తున్న అఖండ హరినామ సప్తాహంలో శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తి కార్యక్రమాలతో సమాజంలోని ప్రజల్లో సద్భావన పెంపొందుతుందన్నారు. ప్రధానంగా యువతకు సనాతన ధర్మ విలువలు తెలుస్తాయని చెప్పారు. ఇటువంటి కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. హరినామ సంకీర్తనలతో ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడిందని కొనియాడారు. అనంతరం పెద్దలతో కలిసి భజన చేశారు. కార్యక్రమంలో విఠలేశ్వర నగర్ ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.



## హైవేపై ఉన్న దాబాల అనుమతులను పరిశీలించాలి: కలెక్టర్



**అక్షరటుడే, కామారెడ్డి:** జాతీయ రహదారిపై ఉన్న దాబాలను తనిఖీ చేసి అనుమతులు ఉన్నాయా లేదా పరిశీలించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆయన సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న ప్లాస్టిక్ సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు నేషనల్ హైవే పై ఉన్న దాబా హోటళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. హైవేపై ఉన్న అన్ని దాబా హోటళ్లకు పంచాయతీ కార్యదర్శులు నోటీసులు జారీ చేసి, వారికి సంబంధిత లైసెన్సులు ఉన్నాయా లేదా, నేషనల్ హైవే అధికారుల అనుమతి తీసుకున్నారా లేదా అనే విషయాలను పరిశీలించాలని ఆదేశించారు. ప్రయాణికులు, ప్రజలు నేషనల్ హైవేపై ప్లాస్టిక్, ఫుడ్ వేస్టేజ్, పేపర్ వేస్టేజ్ వంటి చెత్తను వేయకుండా రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ దిశగా పంచాయతీలు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట డీపీవో మురళీ, మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి, డీఎల్పీవో శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, వైస్ చైర్‌పర్సన్ కాసర్ల గోదావరి పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే మదన్‌మోహన్‌కు ఘనస్వాగతం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** విదేశీ పర్యటన ముగించుకుని స్వదేశానికి తిరిగి వచ్చిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావును మున్సిపల్ ఛైర్మన్ పద్మ శ్రీకాంత్, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణంలో జరుగుతున్న 99 రోజుల ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమం వివరాలను ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఎల్లారెడ్డి పట్టణంలో ఉన్న పలు సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను విన్నవించారు. అదేవిధంగా రాబోయే రంజాన్ పండుగను దృష్టిలో ఉంచుకొని ముస్లింలకు ప్రభుత్వం తరపున ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఏర్పాట్లపై కూడా చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు శంకరయ్య, చంద్రయ్య, గఫార్, సిద్ధి శ్రీధర్, గాదె తిరుపతి, ఎరుకల దశరథ్ తదితరులతో పాటు కాంగ్రెస్ నాయకులు మంచిర్యాల విద్యాసాగర్, డాక్టర్ శ్యామ్, ప్రశాంత్ గౌడ్, రఫీక్, పప్పు వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెరుగైన విద్యా వసతులు

**అక్షరటుడే, బాన్సువాడ:** ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో నిష్ణాతులైన అధ్యాపకులు బోధిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నారని బాన్సువాడలోని ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్ తెలిపారు. శుక్రవారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో బాన్సువాడ, బీర్కూర్, వర్ని, గాంధారి, పిట్లం, బిచ్కుంద ప్రాంతాల్లోని పరీక్షా కేంద్రాల వద్ద కళాశాల అధ్యాపకులు ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరి ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. ప్రైవేట్ కళాశాలలతో పోలిస్తే ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన బోధనతో పాటు అనేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధన, గ్రంథాలయం, ప్రయోగశాలలు, డిజిటల్ వసతులు విద్యార్థుల అభ్యాసానికి ఎంతో ఉపయోగ పడతాయని వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇరాన్‌పై యుద్ధం కారణంగా చమురు, గ్యాస్ సరఫరాపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రభావం భారత్ సహా అనేక దేశాల్లో కనిపిస్తోంది. సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందనే భయంతో వినియోగదారులు ముందుగానే సిలిండర్లను బుక్ చేసుకోవడం ప్రారంభించారు. ఫలితంగా కొన్ని ప్రాంతాల్లో గ్యాస్ సిలిండర్ల కొరత ఏర్పడింది. అయితే గృహావసరాల సిలిండర్లు పక్కదారి పడుతుండడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారస్తులు వీటిని బ్లాక్‌చేస్తుండడంతో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లకు కొరత ఏర్పడుతోంది. దీంతో సివిల్ సప్లయ్స్ అధికారులు రంగంలోకి దిగారు.

– అక్షరటుడే, బాన్సువాడ



### డొమెస్టిక్ గ్యాస్ దుర్వినియోగం..

# అధికారుల దాడులు ముమ్మరం

■ ఉమ్మడిజిల్లాలో పలు హోటళ్లపై అధికారుల దాడులు ■ వందల్లో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు సీజ్ ■ మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం

గ్యాస్ కొరత లేదని అధికారులు స్పష్టం చేస్తున్నా వినియోగదారులు మాత్రం ఆందోళనకు గురవుతున్నారు. దేశవ్యాప్తంగా ఎల్పీజీ సరఫరా సాధారణంగానే కొనసాగుతోందని, నిల్వలు సరిపడా ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది. అయినప్పటికీ వినియోగదారులు భయంతో ముందుగానే సిలిండర్ల కోసం బుక్ చేయడం, ఒకేసారి ఎక్కువగా డిమాండ్ కావడం వల్ల పంపిణీ కేంద్రాల వద్ద రద్దీ కనిపిస్తోంది.

**డొమెస్టిక్ సిలిండర్ల దుర్వినియోగం..**

ప్రస్తుత పరిస్థితుల్లో గృహ వినియోగానికి ఇచ్చే ఎల్పీజీ సిలిండర్లను హోటళ్లు, స్వీట్ షాపులు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాణిజ్య వినియోగానికి ప్రత్యేకంగా కమర్షియల్ సిలిండర్లు ఉండగా.. తక్కువ ధర కారణంగా కొందరు గృహ సిలిండర్లను అక్రమంగా వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఉమ్మడి జిల్లాలో రెండు మూడు రోజులుగా దాడులు చేస్తున్నారు.



**ప్రజల్లో ఆందోళన..అధికారుల అప్రమత్తత**

ఒకవైపు యుద్ధ ప్రభావంతో ధరలు పెరుగుతాయనే భయం, మరోవైపు సరఫరా కొరత ఉందనే ప్రచారం ప్రజల్లో ఆందోళనకు దారి తీస్తోంది. అయితే అధికారులు మాత్రం గ్యాస్ సరఫరా సాధారణంగానే ఉందని చెబుతూ వినియోగదారులు భయపడవద్దని సూచిస్తున్నారు.

**పలు ప్రాంతాల్లో దాడులు..**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సివిల్ సప్లయ్స్ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. బాన్సువాడ, బీర్కూర్ పట్టణాల్లో నిర్వహించిన దాడుల్లో గృహ సిలిండర్లను హోటళ్లలో వినియోగిస్తున్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనల్లో సుమారు 20 కేసులు నమోదు చేశారు. అదేవిధంగా బోధన్ పట్టణంలో ఒక స్వీట్ షాప్ లో 15 గృహ సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశారు. శుక్రవారం ఆర్మూర్ పట్టణంలో దాడులు చేసి 68 డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలోని మరికొన్ని ప్రాంతాల్లో కూడా ఇదే తరహా దాడులు కొనసాగుతున్నట్లు సమాచారం.

**కఠిన చర్యలు తప్పవు..**

గృహ అవసరాల కోసం మాత్రమే ఇచ్చే సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సివిల్ సప్లయ్స్ అధికారులు హెచ్చరిస్తున్నారు. అక్రమ వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు జిల్లాలో నిరంతరం తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. కృత్రిమ కొరత సృష్టిస్తే ఊరుకునేది లేదని వారు హెచ్చరిస్తున్నారు.



## పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

**అక్షరటుడే, ఆర్మూర్ :** పట్టణ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, పరిసరాలు బాగుంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఆర్మూర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోనె లహరి అన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 15వ వార్డులో తడి-పొడి, హానికరమైన చెత్తను ఇంటి దగ్గరే విభజించి స్వచ్ఛ ఆటోలకు ఇవ్వాలని వార్డు ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ గోనె లహరి మాట్లాడుతూ.. సింగిల్ జ్యూస్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని జూట్ బ్యాగులు వాడాలన్నారు. బయట ఎక్కడ కూడా చెత్త పారేయరాదని చెత్తపారేస్తే జరిమానా విధించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ పూర్ణమౌళి, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్ రాజలింగం, మెప్మా ఆర్పీలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



## పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**అక్షరటుడే, బోధన్:** మండలంలో పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బోధన్ ఎంఈవో నాగయ్య తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయన్నారు. బోధన్ ఉమ్మడి మండలాల్లో 13 సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. 3,270 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని.. 13 మంది సూపరింటెం డెంట్లు, 13 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, ముగ్గురు అదనపు డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించగా 160 మంది ఇన్విజిలేటర్లుగా విధులు నిర్వహిస్తున్నారని ఎంఈవో తెలిపారు.

## బాధిత కుటుంబానికి నిత్యావసరాల పంపిణీ




**అక్షరటుడే, బాన్సువాడ:** బీర్కూర్ మండలం కిష్టపూర్‌లో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో కుమ్మరి తుక్కవ్వ కుటుంబానికి చెందిన ఇల్లు, గృహోపకరణాలు కాలిపోయాయి. దీంతో కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో గ్రామ యువకులు సహాయం చేసేందుకు ముందుకొచ్చారు. గ్రామ యువకుడు పర్స రవి ఈ విషయాన్ని లయన్స్ క్లబ్ సభ్యులకు తెలియజేయగా, వారు వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి రూ.5 వేల విలువైన నిత్యావసర వస్తువులు, దుస్తులను అందజేశారు. లయన్స్ సభ్యులు తుక్కవ్వ ఇంటికి వెళ్లి సహాయక సామగ్రిని అందించి వారికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షులు సితలే రమేష్, సీనియర్ లయన్స్ సభ్యులు కిషోర్ ప్రభుదాస్, మురళీ సెట్, సాయి కృష్ణ, భరత్ పాల్గొన్నారు.

## అర్ధరాత్రి ఎస్పీ ఆకస్మిక తనిఖీలు




**అక్షరటుడే, కామారెడ్డి:** రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలకు చెక్ పెట్టేందుకు పోలీసులు చేపట్టిన ఆపరేషన్ కవచ్ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర గురువారం అర్ధరాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది తీరును పర్యవేక్షించారు. సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాప్లిన్ డివైస్ ద్వారా 285 మందిని తనిఖీ చేశారు. హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న ఓ డీసీఎం వ్యాను ఆపి డ్రైవర్‌కు డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు చేశారు. అతడికి 210 పర్సెంటేజ్ వచ్చింది. దీంతో కేసు నమోదు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ.. మద్యం సేవించి బాధ్యతారాహిత్యంగా వాహనం నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం నిరంతరం డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఆపరేషన్ కవచ్‌లో భాగంగా మొత్తం 305 మందిని తనిఖీ చేయగా 14 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. అనంతరం సిరిసిల్ల రోడ్డులో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందితో కలిసి అర్ధరాత్రి టీ, స్నాక్స్ తీసుకున్నారు. ఈ తనిఖీలలో ఏఎస్పీ చైతన్య రెడ్డి, కామారెడ్డి పట్టణ సీఐ నరహరి, మాచారెడ్డి, సదాశివనగర్, ఎల్లారెడ్డి, నస్రుల్లాబాద్, బాన్సువాడ ఎస్సైలు అనిల్, పుష్పరాజ్, మహేష్, రాఘవేంద్ర, రాములు సిబ్బంది పాల్గొన్నారు.

## హెల్త్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి



**అక్షటుడే, పెద్ద కొడప్‌గల్:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 17న మంగళవారం హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు వైద్యుడు ఉమాకాంత్ తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జనరల్ ఫిజీషియన్, దంత వైద్యులు, నేత్ర వైద్యులు, పిల్లల వైద్యులు, ఆర్థోపెడిక్, స్త్రీ వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారన్నారు.

## ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికపై సమీక్ష



**అక్షరటుడే, ముప్కాల్:** 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ముప్కాల్ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో మాంసం అమ్మకాల దుకాణాల యజమానులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పరిశుభ్రత, నిబంధనల పాటింపు వంటి అంశాలపై చర్చించారు. సర్పంచ్ కొమ్ముల సాయవ్వ వ్యాపార యజమానులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిన్నయ్య, వార్డు సభ్యులు, వ్యాపార యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు



**అక్షరటుడే, ఇందూరు:** తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కవిత జన్మదినాన్ని జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. జాగృతి కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం తెలంగాణ జాగృతి ప్రతినిధి శంకర్ మాట్లాడుతూ తెలంగాణ జాగృతిని స్థాపించి రాష్ట్ర నిర్మాణంలో క్రియాశీలక పోషించిన కవిత తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు కాపాడుతూ వస్తున్నారన్నారు. అనంతరం అవంతి రావు మాట్లాడుతూ.. కరోనా సమయంలో కోవిడ్ పేషెంట్లకు అండగా నిలబడ్డ కవిత.. తెలంగాణ జాగృతి స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించారన్నారు. కార్యక్రమంలో జాగృతి ప్రతినిధులు ప్రవీణ్ కుమార్, హనుమగిరి గట్టు హరికృష్ణ, కుల్దీప్, పంచ రెడ్డి మురళి, శంకర్, శ్రీనివాస్ గౌడ్, రేఖ, సరిత, శ్రీకాంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**లింగంపేటలో..**



**అక్షరటుడే, లింగంపేట:** మండల కేంద్రంలో జాగృతి అధినేత్రి కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను జాగృతి నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా జాగృతి జిల్లా అధ్యక్షుడు ఎదురుగట్ల సంపత్ గౌడ్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లను పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పోకల సాయిరాం, ఆ పార్టీ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు జైల్ సింగ్, రాజేందర్, పరంధాములు, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రావెల్స్ బస్సు బోల్తా.. నలుగురి దుర్మరణం

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** జాతీయ రహదారి 44పై తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా.. నిజామాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఇందల్వాయి మండలంలో ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. 44వ జాతీయ రహదారిపై ఇందల్వాయి మండలం గన్నారం శుక్రవారం తెల్లవారుజామున ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. హైదరాబాద్ నుంచి 22 మంది ప్రయాణికులతో మహారాష్ట్రలోని అకోలాకు వెళ్తుండగా బస్సు గన్నారం శివారులో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో నలుగురు ప్రయాణికులు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడడంతో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇందల్వాయి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

**ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఆర్టీఏ అధికారులు..**

ఇందల్వాయి మండలం గన్నారం గ్రామ శివారులో ఘోర బస్సు ప్రమాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో నలుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందారు. పలువురు గాయపడగా వారికి నగరంలోని జీజీహెచ్‌లో చికిత్స అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో బాక్స్‌లో సుమారు 60 రామచిలుకలను కుక్కినట్లుగా ఉంచడంతో ఊపిరాడక 8 మృతి చెందాయి. దీంతో మిగిలిన చిలుకలను బయటకు తీసి వాటిని నీళ్లు తాగించి అనంతరం సమీప అటవీప్రాంతంలో వదిలిపెట్టినట్లు అధికారులు తెలిపారు. గాయపడ్డ చిలుకలను స్థానిక పశువైద్యశాలకు తరలించారు. తనిఖీల్లో ఎంపీఐ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.





## రన్నింగ్ కారులో మంటలు.. కామారెడ్డి శివారులో ఘటన



**అక్షరటుడే, కామారెడ్డి:** రన్నింగ్ కారులో దట్టమైన పొగలతో మంటలు వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని లింగాపూర్ శివారులో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. లింగాపూర్ గ్రామానికి చెందిన అనిల్ గ్రామం నుంచి కామారెడ్డి వైపు వెళ్తుండగా ఒక్కసారిగా కారులోంచి దట్టమైన పొగలు వచ్చాయి. ఆ వెంటనే మంటలు వ్యాపించడాన్ని గమనించిన అనిల్ వెంటనే అప్రమత్తమై కారులో నుంచి బయటకు దూకేశాడు. దాంతో ఒక్కసారిగా చెలరేగిన మంటలతో అంటుకున్న కారు పూర్తిగా దగ్ధమైంది. వెంటనే అప్రమత్తమైన అనిల్ ఫైర్ ఇంజన్ అధికారులకు, పోలీసులకు సమాచారం చేరవేశాడు. ఘటనా స్థలానికి ఫైర్ ఇంజన్ అధికారులు చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఘటనా స్థలానికి కామారెడ్డి అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి చేరుకొని విచారణ చేపట్టారు. దగ్ధమైన కారు లింగాపూర్ గ్రామానికి చెందిన బందెల రాజుకు చెందినదిగా పోలీసులు గుర్తించారు.